# సామాన్య సంసారి స్వాతంత్ర్యదినపండుగ

• కొంపెల్ల సోమనాధం •

శెట్టి హోటలమీదుగా పోయే మార్గాన్ని బట్టించాడు. హోటల్లోంచి ఎవరో కేకేసినట్లయింది. ఆహ్వానం తిరస్కరిస్తే శెట్టికి కోపం రాదూ అని లోపలికి అడుగుపెట్టాడు శెట్టి చిరునవ్వుతో వచ్చారా? అన్నట్లు ఖాళీ కుర్చీవైపు తన దృష్టి మరల్చి ఈ కుర్చీలోకి దయచేయండి అని రమేశానికి సీటు చూపించాడు. శెట్టి హోటల్లో ఆ టైములో సీటు దొరికినందుకు తనలో ముగ్ధుడయాడు రమేశం. మరో నిముషానికి 'సర్వరు' ప్రత్యక్షమయి మందహాసంతో ఏమి తెమ్మంటారు సార్' అన్నాడు. ఆ వినయం; నెమ్మది యింటిదగ్గర వాళ్ళకి తెలియదేం! అనుకుంటూ....ఏమైనా వేడిగావుంటే రెండు యిడ్లెన్లు తీసుకురా! అన్నాడు రమేశం. మరో నిముషానికి ఎదురుగా ఒక ప్లేటులో రెండు యిడ్లెన్లు హాజరయాయి.

కొత్త రికార్డులు తెప్పించేము ఈమధ్య మీరు ఎక్కడా వినివుండరనుకుంటాను అంటూ శెట్టి ఒక రికార్డు వేశాడు. ఆ రికార్డు 'అన్మోల్‌ఘడ్' లో నూర్జహాన్ పాడింది. శబ్దం కొంచెం హెచ్చించాడు శెట్టి దానితో హాలులో పలహారం చేస్తున్న అతిధులు యావన్మంది తన్మయులై తమ కార్యాలని గుర్తెరక్కవున్నారు.

మన రమేశం ఈ ప్రపంచంలోనే లేడని చెప్పవచ్చును. జేబులో డబ్బు తక్కువగావుండి రెండు యిడ్లెనతో తృప్తిపొందాలనుకున్న రమేశానికి ఆ పాట మాధుర్యంలో ఎంత తిన్నది తెలియనే లేదు. 'క్యా మిల్‌గయ భగవాన్' శాంతం అయింది. ప్లేటు మార్చాడు శెట్టి. రమేశం కాస్త కాఫీ కతికి బయటికి పోవడానికి చూస్తున్నాడు. ఇంతలో సర్వరు బిల్లుసార్ అంటూ ఎనిమిది అణాల అంకెలు చూపిస్తూ బిల్లు అందించాడు. రమేశం జేబులో డబ్బులు తూకం నాల్గు అణాలుమాత్రమే. బిల్లు చూశాడు, జేబు చూశాడు. శెట్టికి నాల్గు అణాలు బాకీపడ్డాడు. ఆ పాద మస్తకం కంపించిపోయాడు. హాల్లో ఎరిగున్న మొఖాలు ఏవీ లేవుకదా! అని వెనుతిరిగి కలయజూచాడు. ఎవ్వరు లేకపోవడంతోటే గుండె కాస్త నిబ్బరపడింది. శెట్టిదగ్గరకి వెళ్ళాడు. పర్సు మరిచిపోయానని ఒక సొరకాయకోతకోసి జేబులో పొరపాటున వుండిపోయిన చిల్లర డబ్బులు శెట్టి చేతిలో పెట్టి మిగత సాయంత్రం యిస్తానని చెప్పాడు. చేతులోవున్న ఖాళీ సంచి అందాక వుండనివ్వమని చెప్పి బల్లమీద పెట్టేడు. "ఆహా! మీరేం తెలియనివారా! అక్కర్లేదు" అంటూనే సంచీ మెల్లగా బల్లకిందకి చేరదీశాడు శెట్టి విషపునవ్వు నవ్వుతూను.

ఇంతటితో ఈ పీడ యిలా విరగడయినందుకు సంతోషిస్తూ యివతల పడి కాళీ చేతులతో యింటిముఖం పట్టేడు రమేశం. మార్గమధ్యంలో 'క్యా మిల్‌గయ భగవాన్' అనే పాట యింకా చెవుల్లో రింగుమంటూ ప్రతిధ్వనిస్తూనే వుంది.

యిల్లు ముఖం చూడగానే కమల స్వతంత్ర దినం పండగకోసం తెమ్మనిచెప్పిన బంగాళా దుంపలు, ఉల్లిగడ్డలు జ్ఞాపకం వచ్చాయి. తన్ని తానే క్యా మిల్‌గయ భగవాన్ అని ప్రశ్నించుకున్నాడు. ఏమిటి జరిగింది తనకి. జేబులోవున్న పావలా డబ్బులు ఖర్చవకుండా కూర్లకోసం రూపాయిపెట్టి కొన్న కొత్త సంచి శెట్టిహోటల్లో తాకట్టు—కడుపునిండని ఫలహారం.